

# కథకుల కథ

పి. యస్. శాస్త్రి

"ఏమ్ రాజూ! నాకో బ్రిలియంట్ అయిడియా వచ్చింది. వెంటనే కథ వ్రాస్తున్నాను!" అన్నాడు గోపాలం యెగిరి గంతు లేస్తూ!

"పోవోయ్ గోపాలం! నువ్వు యిప్పటిదాకా యెన్ని కథలు వ్రాసి పెట్లో పారెయ్యలేదు? ఇవాళ యేదో పెద్ద ఘనకార్యం చెయ్యబోతున్నట్టు చెబుతావేం?" అన్నాడు రాజు కసురుకుంటూ.

గోపాలం ఉత్సాహం కాస్తా గాలిలో కెగిరి పోయింది. "ఏమ్ రాజూ! నీకు పుణ్యముంటుందిరా బాబూ! ఈరాసే వొక్క కథా మాత్రం నువ్వు వినక తప్పదు! కావలిస్తే చచ్చి నీ కడుపున పుడతా!" అంటూ రాజును బ్రతిమాలు కొన్నాడు.

"ఏం? చచ్చి నా కడుపున పుడితే, అప్పుడు చదివినట్టు వింటానా? ఏ ఊహ? ఛస్తే వినను!" అన్నాడు రాజు విసురుగా.

"రాజు పరిస్థితి చూసి గోపాలానికి మతిపోయింది. "రాజుకేమైం

దివ్వాళ? ఇవ్వాళ రాజుకేమైంది? అనుకున్నాడు.

మెల్లిగా ప్లేటు ఫిరాయించి, తెరు కొడితేనేకాని రాజు, తనను కథ రాసుకోనివ్వడు! వినడు! ఈ రెండింట్లో యేది జరుగక పోయినా తనకు తోచిచావదు!

ఇప్పటికే గోపాలం బోలెడు కథలు వ్రాసి ప్రక్కగదిలోని పెట్లో పారేశాడు! ఐనా వ్రాయాలనే తృష్ణ తగ్గటం లేదు! వార, పక్ష, మాసపత్రికలలో కథలు చదివినప్పుడల్లా తను కూడా యింత మంచి కథలు వ్రాయగలననే ఉత్సాహం కొద్దీ వ్రాసి పారేసేవాడు! కాని పత్రికలు మాత్రం వాటిని ప్రచురించడానికేం ఉత్సాహం చూపలేదు!

కనుక తన తోడునీడైన రాజే తన కథారథ సారథి! కర్ణదాత! జీవితాంతపు శ్రోత!

అటువంటి వాడు ఇవ్వాళ ఇంత వేడి వేడిగా మాట్లాడుతున్నాడంటే యేదో ఉపద్రవం జరిగి వుండాలి! అది కనుక్కొని రాజును మంచి చేసుకోకపోతే, ఉన్న వొక్క శ్రోతా గాలిలో కలిసిపోతాడు!

పోనీలే రాజూ! వెధవ కథ! నేను వ్రాయనూవద్దు! నీవు విననూవద్దు! ఏదో ప్రొద్దుపోక అలా అన్నానంతే! అన్నట్టు 'ప్రొద్దు' అంటే గుర్తొచ్చింది. నువు ప్రొద్దున 'పరల్ బై నైట్' పిక్చరుకు వెళ్దామన్నావు కాదూ? మరిచేపోయాను! పోదాం పద! నీ డబ్బులు కూడా నేనే పెట్టుకుంటాను" అన్నాడు గోపాలం గబ గబా తన మాటల రంగునీ తను తొడుక్కున్న రంగు చొక్కానీ మారుస్తూ!

అలా మెల్లిగా గోపాలం రాజును చల్లబరిచి అసలు కథ రాబట్టాడు.


ఆ రోజు ఆదివారం కావటంవల్ల పది గంటల వేళ రాజు తనతో పాటే ఆఫీసులో పనిచేసే మాధవరావ్ కులకర్ణి ఇంటికి వెళ్ళాడట. వీడి దురదృష్టవశాత్తు మాధవరావ్ కులకర్ణి కూడా అనేక "అముద్రిత" మరాఠీ కథా సంపుటాల రచయితట. అవి అతను మరాఠీ పత్రికలకు పంపిస్తే అవి ఇతను ప్రవాస మహారాష్ట్రీడనేనా అభిమానం చూపక వెంటనే త్రిప్పి పంపేవిట!

మరాఠీ శ్రోతలు కరువైన కులకర్ణి రాజును కూర్చోబెట్టి, తన కథను ముందు మరాఠీలోనూ, ఆ తరువాత దాన్ని తెలుగులోకి మార్చి వీడి ప్రాణం తీశాడట!

వాళ్ళింటికి వెళ్ళేటప్పటికే రాజు గోపాలం దగ్గిర వాడి "కోటా" కథను వినేసి తగిన ఫీజు వసూలు చేసుకొని బయటపడ్డాడు. తలనొప్పితో!

దాని మీద ఈ మరాఠీ, తెలుగు అనువాదం, కథ వినేసరికి పిచ్చి కోపం వచ్చిందట!

ఆ వేడిలో ఇంటికి వచ్చిన రాజుకు, గోపాలంగాడు గుమ్మంలోనే యెదురై "కథ రాస్తాను" అంటే తంతానన్నాడు! అదీ కథ!




ఈ కథ విన్న గోపాలానికి బుర్రలో బ్రహ్మాండమైన మెరుపు మెరిసింది. కాని పైకి చెబితే రాజు మళ్ళీ తంతానంటాడో యేమోనని భయం వేసింది అందుకని నోరు మూసుకు వూరుకొన్నాడు.

మర్నాడు ప్రొద్దున్నే టిఫిన్ చేసి గోపాలం రాజుతో మాట మాత్రమైనా చెప్పకుండా కులకర్ణి ఇంటికి వెళ్లాడు.

అప్పటికే కులకర్ణి తన మరాఠీ కథలతో కుస్తీ పట్టున్నాడు.

గోపాలం కులకర్ణికి తనంతతనే పరిచయం చేసుకుని, చాలా సేపు మాట్లాడాడు.

అంతే! అటుపైన వారం, వారం, వివిధ పత్రికల్లో గోపాలం కథలు పడ్డం ప్రారంభించాయి!

కాని రాజుకి ఈ సంగతు లేవీ తెలియవు. గోపాలం కోటా కథలు వినిపించడం మానేసినందుకు బోలెడు సంతోషపడ్డాడు. అడిగతే మళ్ళీ ఎక్కడ తగులుకుంటాడో అని అసగతే ఎత్తలేదు!

ఓ రోజు మామూలుగా పత్రికలు తిరగేస్తూంటే ఓదాంట్లో వో కథ కనుపించింది. దాని మీద "ప్రఖ్యాత మరాఠీ రచయిత మాధవరావ్ కులకర్ణి రచనకు స్వేచ్ఛానుసరణ - గోపాలం" అని వుంది.

రాజుకు తల తిరిగిపోయింది. మాధవరావ్ కులకర్ణి మరాఠీలో ప్రఖ్యాత రచయిత యెప్పుడయ్యాడో అర్థంకాలేదతనికి! పోనీ అయ్యాడే అనుకుందాం! తెలుగే సరిగా వచ్చిచావని ఈ గోపాలం

గాడికి మరాఠీ యెల్లా వచ్చింది? అనువాదం ఎప్పుడు, ఎల్లా చేశాడు? అన్నీ ప్రశ్నలే! గోపాలమే చెప్పాలి జవాబు అనుకుంటూ యింటికి పరుగెట్టాడు.

లోపలి కొస్తూనే 'గోపాలం, గోపాలం' అని చావు కేకలాంటి రెండు గావుకేకలు పెట్టాడు!

చేతిలో వున్న పత్రికలోని కథ తీసి చూపిస్తూ, 'ఏంట్రా ఇది? ఇది యేమిటి?' అన్నాడు గోపాలాన్ని దబాయిస్తూ!

గోపాలం సర్వజ్ఞుడైన వ్యాస మహర్షిలా చిరునవ్వు నవ్వాడు.

'మాధవరావ్ కులకర్ణి ఇంటికి పోదాం రారాదూ! చాలా రోజులైంది చూసి పాపం!' అన్నాడు.

రాజుకు అరికాలి మంట నెత్తికెక్కింది. బోడి వెధవ! బోడి వెధవ సస్పెన్స్ వీడూను! తిన్నగా జవాబు చెప్పడేం? తనెన్నిమాట్లు వద్దంటున్నా 'ఇదీ నా కథలో సస్పెన్స్' అంటూ తననెంత బోరు కొట్టేవాడు? వినరా బాబూ అనిఫీలిచ్చి కాళ్ళు పట్టుకునేవాడు! అల్లాంటి వెధవ, వో అనువాదం కథ వచ్చేసరికి యెంత ఫోజు కొట్టేస్తున్నాడు' అనుకున్నాడు.

కులకర్ణి ఇంటికి వీళ్ళు చేరేసరికి అక్కడ ఇంత కంటె హడావుడిగా వుంది. కులకర్ణి మూడు నాలుగు మరాఠీ పత్రికలు చేత్తో పట్టుకుని సంతోష పడిపోతున్నాడు.

గోపాలాన్ని చూడగానే యెగిరి గంతేసి 'గోపాలంగారూ మీరు చాలా జీనియస్! మిమ్మల్ని దేవుడు ఈ ఆంధ్ర దేశంలో కాక యే అమెరికాలోనో పుట్టిస్తే బోల్డు గొప్పవారు, కోటీశ్వరులు అయిపోయి వుందురు. నావి మూడు కథలు మా పత్రికల వాళ్ళు - ప్రచురించారు' అన్నాడు పొంగిపోతూ.

రాజుకి మరీ అయోమయమయిపోయింది! 'పదిహేను, ఇరవయ్యి రోజుల క్రిందటి వరకు తిరిగి వస్తున్న కులకర్ణి కథలు పత్రికల్లో యెలా ప్రచురితమవుతున్నాయి? దానికి గోపాలంగాడి సహాయమేమిటి? అనుకొన్నాడు ఆశ్చర్యపోతూ!

కొంచెం సేపటికి కులకర్ణి మరాఠీ రాని తన మిత్రుల సౌకర్యార్థం తన కథని తెలుగు చేసి వినిపించడం మొదలు పెట్టాడు. కథ పేరు చదివి 'ప్రఖ్యాత తెలుగు కథకులు శ్రీ గోపాలంగారి కథకు మాధవరావు కులకర్ణి స్వేచ్ఛానుసరణం' అని చదివాడు.

తీరా వింటే, ఆ కథ ఇంతకు ముందు కులకర్ణి రాజుకు బలవంతంగా చదివి వినిపించిందే!

రాజుకు ఇప్పుడంతా అర్థమయింది!

□□□